# బేరం

"మీకోసం మురళీకృష్ణ వచ్చి వెళ్ళాడు. మళ్ళీ ఎనిమిది తర్వాత వస్తానని మీతో చెప్పమన్నాడు"

క్లబ్బు నుండి ఇంటికి రాగానే చెప్పింది నా శ్రీమతి.

ఆశ్చర్యపోయాను!

'అంత అర్జంటు వ్యవహారం ఏమిటో? మధ్యాహ్నం బ్యాంక్కులో కనిపించినప్పుడు కూడా ఏమీ చెప్పలేదే!' అనుకున్నాను మనసులో

స్నానం చేసి వరండాలో కూర్చున్నాను మురళీకృష్ణ కోసం ఎదురుచూస్తూ!

మురళీకృష్ణ నాకు మంచి స్నేహితుడు. టెలిఫోన్ డిపార్ట్‌మెంట్‌లో క్యాషియర్‌గా పని చేస్తుంటాడు. ఆఫీసు పని మీద తరచూ నేను పని చేసే బ్యాంక్‌కి వస్తూ ఉండటంతో మా ఇద్దరి పరిచయం బలపడింది. ఇద్దరి భావాలు, అభిరుచులూ ఒకటే కావడంతో ఆ పరిచయం మంచి స్నేహంగా పరిణామం చెందడానికి ఎక్కువకాలం పట్టలేదు.

మురళీకృష్ణకు ఇంకా పెళ్ళి కాలేదు. ఇంట్లో వాళ్ళు ఏవో సంబంధాలు చూస్తున్నారని చెప్పాడు గాని ఇంకా ఏదీ సెటిల్ కాలేదు. అతనిలో నాకు నచ్చే గుణం అతని అమాయకత్వం, నిష్కల్మషత! మనసులో ఏదీ దాచుకునే అలవాటు లేదు. తనకింకా పెళ్ళికాకపోవటానికి తండ్రే కారణమంటాడు.

'నా ద్వారా లాభించే కట్నంతో చెల్లెలి పెళ్ళి జరిపించాలనేది ఆయన ఆశ, ఆలోచన. అందుకే వరకట్నపు విపణి వీధిలో నా రేటు ఇంత అని ఫిక్స్ చేశాడు కూడా. నాకు నచ్చిన అమ్మాయిలు అంత కట్నం ఇచ్చుకోలేక వెనక్కి పోతే, కోరినకట్నం ఇచ్చే వాళ్ళు నాకు నచ్చడం లేదు. అందుకే ఇంకా ఇలా బ్రహ్మచారిగా మిగిలిపోయాను.' అంటూ వాపోతూ ఉంటాడు నా దగ్గర అప్పుడప్పుడు.

ఆలోచనల్లో పడి మురళీకృష్ణ రాకను గుర్తించలేదు నేను. 'సారీ గురూ! నా కోసమే వెయిట్ చేస్తున్నట్లున్నావు. హోటల్లో భోజనం దగ్గర బాగా లేటయిపోయింది!' కుర్చీ లాక్కుని కూర్చుంటూ అన్నాడు మురళీకృష్ణ.



'ఫర్వాలేదు లేవోయ్. అయినా ఈ హోటల్ భోజనం ఇంకా ఎంకాలం చెప్పు! ఏదో ఒక సంబంధం త్వరగా సెటిల్ చేసుకోకూడదూ!' చనువుగా అన్నాను. వయసులో నా కంటె చిన్నవాడు కావటంతో అతన్ని చనువుగా ఆటపట్టిస్తూ ఉండటం నాకు అలవాటే!

"ఆ ప్రయత్నంలో భాగంగానే ఇప్పుడు నీ దగ్గరకొచ్చాను గురూ! నువ్వు కాస్త సాయం చేస్తే ఓ ఇంటివాడ్ని అవుతాను' అన్నాడు.

నేను చేయగలిగిన సాయం ఏమిటో నా వూహకు అందలేదు.

ఈ విషయంలో ఎలాంటి సాయం అందించటానికైనా నేను ఎప్పుడూ సిద్ధమే. నువ్వు ఒక ఇంటి వాడివి కావటం కంటె కావలసింది ఏముంది చెప్పు! ఇంతకీ అసలు విషయంలోకి రా! అన్నాను సిగరెట్టు ముట్టిస్తూ.

మురళీ కృష్ణ కొద్ది క్షణాలు మౌనంగా

ఇ.టి. రామారావు

ఉండి ఆ తర్వాత అన్నాడు.

'మీ బ్యాంకులో పని చేసే సరస్వతి అనే అమ్మాయిని నాకొకసారి పరిచయం చేశావు గుర్తుందా? ఆ అమ్మాయి నాకెంతో నచ్చిం దనీ, ఆ సంబంధం మాట్లాడి సెటిల్ చేయ మని నీతో చెపితే నువ్వేమన్నావో తెలుసా!

మా నాన్న అడిగే కట్నం రేంజ్‌కి వాళ్ల అందుబాటులో లేరని చెప్పావు. పాతిక వేల వరకైతే ఇవ్వగలరని చెప్పావు. ఇటీవలనే వాళ్ల పాతి వేలుఇవ్వడానికి సిద్దపడి ఒక సంబంధం మాట్లాడుకున్నారని, అయితే ఇద్దరి జాతకా లు కుదరకపోవటంతో ఆ తర్వాత మానుకు న్నారని కూడా చెప్పావు. పాతిక వేల కట్నంతో సరస్వతిని చేసుకోవడానికి నేను సిద్ధం. ఈ విషయం వాళ్ల పెద్దలతో నువ్వే మాట్లాడి సెటిల్ చేయాలి. ఇదే నువ్వు నాకు చేయవల సిన సాయం.''

మురళీకృష్ణ మాటలు విని ఆశ్చర్యపోయా ను. ఇంత హఠాత్తుగా ఇలాంటి నిర్ణయానికి రాగలిగాడంటే తండ్రి మొండి పట్టుదల వల్ల ఎంతగా విసుగెత్తి పోయాడో అర్థం చేసుకో గలిగాను.

'ఇందుకు మీ నాన్న ఒప్పుకుంటాడంటా వా? ఆయన నీ పెళ్ళి మీద ఏవో పెద్ద ఆశలు పెట్టుకొని ఉన్నాడని, దాదాపు యాభై వేల దాకా రాబట్టాలని చూస్తున్నాడని నువ్వే గదా అన్నావు?' నా మనసులోని అనుమానాన్ని మురళీ కృష్ణముందు పెట్టాను.

'నేను ఎలాగో ఆయన్ని ఒప్పిస్తాను. ఉద్యో గం చేసే అమ్మాయిని ప్రేమించి దమ్మిడీ




కట్నంలేకుండా గుళ్ళో పెళ్ళి చేసుకుంటా నని బెదిరిస్తాను'' దృఢంగా చెప్పాడు. మురళీ కృష్ణ! అతడిలో ఇంత ధైర్యం, తెగింపు రావటం నాకు ఆనందం కలిగించింది. అయితే అంత సులభంగా వాళ్ళ నాన్న ఇతడి ప్రపో జల్‌కి అంగీకరిస్తాడనే నమ్మకం నాకు కలగ టం లేదు.

''అదేదో నువ్వు ముందుగా తేల్చుకుని వస్తే ఆ తర్వాతే సరస్వతి వాళ్ల తల్లిదండ్రు లతో మాట్లాడతాను. తీరా మనం వీళ్ళతో మాట్లాడి ఒప్పించాక మీ నాన్న బ్రేక్ వేశా డనుకో. ఇక్కడ నా పరిస్థితి అసహ్యంగా ఉం టుంది. ఒక బ్రాంచిలో పని చేస్తున్న వాళ్ళం. ప్రతి రోజూ ఒకరి ముఖం ఒకరు చూసుకో వాలి. చాలా సున్నితమైన వ్యవహారం ఇది.''

నా మనసులోని మాటను స్పష్టంగా చెప్పా ను మురళీకృష్ణతో

''అవునవును. ఈ మాట కూడా నిజమే!'' ఒప్పుకున్నాడు మురళీ కృష్ణ కొద్ది క్షణాలు ఏదో ఆలోచిస్తూ ఉండిపోయాడు. ఆ తర్వాత ''అయితే ఒక పని చేస్తాను గురూ! ఎల్లుండి ఆదివారమే కదా! మా వూరెళ్ళి మా నాన్నతో మాట్లాడి ఆయన అంగీకారం తీసుకొస్తాను. ఆ తర్వాత నువ్వు రంగంలోకి దిగవచ్చు'' హు షారుగా అన్నాడు.

అలాగేనన్నట్లు తలూపాను. ఆ తర్వాత కొద్ది సేపు పిచ్చాపాటీ మాట్లాడి వెళ్లి పోయా డు. మురళీకృష్ణ!

నేను ఇంట్లోకి నడిచాను!

**  **  **

సోమవారం ఉదయం పదికొండు గంటల ప్రాంతంలో బ్యాంకుకివచ్చాడు మురళీ కృష్ణ. అతని ముఖంలో ఆనందం, ఉత్సాహం చాలా స్పష్టంగా కనిపిస్తున్నాయి నాకు.

'బహుశా ఇతని ప్రపోజల్‌ని వాళ్ళనాన్నఅంగీక రించి ఉంటాడు. అందుకే ఆ హుషారు' అను కున్నాను.

నా వూహ నిజమే!

''సక్సెస్ గురూ! ఏమూడ్‌లో ఉన్నాడో కాని మా నాన్న ఎలాంటి సాకులు చెప్పకుండా అంగీ కరించాడు. పెళ్ళి రోజుకి పాతిక వేలు ఇచ్చి సంవత్సరంలోగా మరో పాతిక వేలు ఇచ్చే షరతు మీద ఒప్పుకున్నాడు.'

ఉత్సాహంగా చెపుతున్నాడు మురళీ కృష్ణ! అతని వివాహ సమస్య ఇప్పటికైనా పరిష్కార మయినందుకు ఎంతో సంతోషించాను.

ఆ తర్వాత ఒక మంచి రోజు చూసుకొని సరస్వతి వాళ్ళ ఇంటికి వెళ్ళాను. ఆమె తల్లి దండ్రులతో మురళీ కృష్ణ విషయం చెప్పాను.

'కట్నం ఏ మాత్రం ఆశిస్తున్నారు వా ళ్ళు?' అడిగాడు సరస్వతి తండ్రి.

'మీకు అందుబాటులోనే ఉన్నారు లెండి. పాతిక వేలు! మీ అమ్మాయికి ఎలాగూ పాతిక వేల వరకు ఇవ్వడానికి మీరు సిద్దపడే ఉన్నారు గదా!' అన్నాను.

నా మాటకు ఆనందంతో ఎగిరి గంతేస్తా డని ఆశించాను నేను. అయితే ఆయన నిర్లిప్తం గా ఉండటం నాకు ఆశ్చర్య కలిగించింది.

''సరేలెండి. రేపు ఆదివారం అబ్బాయిని తీసు కురండి. అతడిని చూశాక మాట్లాడుకుం



దాం' అన్నాడు. సరేనని చెప్పి వచ్చేశాను నేను

_ *** _

ఆదివారం ఉదయం పదింటికి సరస్వతి వాళ్ళ ఇంటికి చేరుకున్నాం నేను, మురళీ కృష్ణ, అతడి తండ్రి, అక్కయ్య. పెళ్ళి చూపుల య్యాయి . సరస్వతి అందరికీ నచ్చింది. ఆ తర్వాత కట్నకానుల ప్రస్తావన వచ్చింది.

''అమ్మాయి ఉద్యోగం చేస్తున్నది కదా! నెలకు దాదాపు రెండు వేలు సంపాదిస్తున్నది. పెళ్ళ య్యాక ఆ డబ్బంతా వాళ్ళకే చెందుతుంది. అందుచేత పది వేలు మాత్రం ఇవ్వగలను' చెప్పాడు సరస్వతి తండ్రి.

నాకు మతిపోయింది. నిన్న మొన్నటి వరకు కూతురి పెళ్ళి కోసం పాతిక వేలు కట్నం ఇవ్వగలనని తిరిగిన పెద్ద మనిషి ఇప్పు డు మేం ఆ పాతికవేలే అడిగితే ఒక్కసారిగా పది వేలకి తగ్గిపోయాడేమిటి అనే ఆలోచనతో మా మనసు మొద్దుబారిపోయింది. మురళీకృ ష్ణ ముఖం వంక చూశాను. తెల్లగా పాలిపోయి ఉంది అతని ముఖం. వాళ్ళ నాన్న మా ఇద్దరి వంక మిర్రి మిర్రి చూస్తున్నాడు. ఆ తర్వాత ఎంతసేపు మాటలుకొనసాగినా సరస్వతి తండ్రి పదివేలకి మించి ఒక్క రూపాయి కూడా ఎక్కువివ్వలేనని తేల్చి చెప్పడంతో మేము ఆ ఇంట్లో నుంచి బయట పడ్డాం.

దార్లో మురళీకృష్ణని అతడి తండ్రి నోటి కొచ్చినట్లు తిట్టాడు. పాపం మురళీకృష్ణ వంచిన తల ఎత్తితే ఒట్టు! నా పరిస్థితి కూడా దాదాపు అలాగే ఉంది.


మురళీ కృష్ణ నాన్నని, అక్కయ్యని వాళ్ల ఊరెళ్ళే బస్సు ఎక్కించి రిక్షా కోసం బయటి కొచ్చాం.

'గాంధీ బొమ్మ సెంటర్‌కి ఏం తీసుకుం టావు?' ఒక రిక్షా వాడిని పిలిచి అడిగాడు మురళీకృష్ణ.

''ఇద్దరికీ ఐదు రూపాయలివ్వండి సార్!' అన్నాడు రిక్షావాడు.

''నాలుగిస్తాం. వస్తావా?' బేరం ఆడాడు మురళీకృష్ణ. అతను రానని చెప్పి వెళ్ళి పోయా డు. మేం ఇంకొంచెం ముందుకి నడిచాం.

కొద్ది దూరంలో రిక్షా పెట్టుకుని మమ్మే ల్లే గమనిస్తున్న ఇంకో అతను మమ్మల్ని కొద్ది దూరం నడవనిచ్చి మా వెనకే వచ్చాడు.




'గాంధీ బొమ్మ సెంటర్‌కి నేనొస్తాను సార్! మీరిస్తానన్న ఆ నాలుగు రూపాయలు ఇప్పిం చండి' అన్నాడు.

నేను రిక్షా ఎక్కే ప్రయత్నం చేస్తుండగా మురళీకృష్ణ నన్ను చేత్తో అడ్డుకున్నాడు.

'వీడు నాలుగు రూపాయలకే వస్తానంటున్నా డంటే మనం గాని బేరం ఆడితే మూడు రూపాయలకే ఖచ్చితంగా వస్తాడు. చూస్తుం డు'' అన్నాడు నాతోఇంగ్లీషులో రిక్షా వాడికి అర్థం కాకూడదని.

ఆ తర్వాత రిక్షా వాడి వైపు తిరిగాడు మురళీ కృష్ణ

''నాలుగు రూపాయలు చాలా ఎక్కువోయ్! మూడు రూపాయలు ఇస్తాం. వస్తావా చెప్పు' అని అడిగాడు.

అతను విస్మయంగా చూశాడు మురళీ కృష్ణ వంక.

రెండుక్షణాలు అలాగే చూసి ఏం మాట్లా డకుండా రిక్షా లాక్కుని వెళ్ళి పోయాడు. ఆ రెండు క్షణాలు నేను అతని ముఖంలోకి పరిశీ లనగా చూస్తూనే ఉన్నాను.

మళ్ళీ నడక సాగించాం. నేను, మురళీ కృష్ణ

నడుస్తూనే మాట్లాడుతున్నాడు మురళీ కృష్ణ


''ఆ సరస్వతి వాళ్ళ నాన్నది ఏం మన స్తత్వం గురూ! ఆయన ఎవరికో ఇవ్వడానికి సిద్ధపడ్డ ఆ పాతికవేల కట్నమే మనం అడిగితే తపీమని పది వేలకి తగ్గించేశాడు. మనకై మనం వెళ్ళి అడిగామని అలుసుకాబోలు అవ కాశవాదులంటారు ఇలాంటి వాళ్ళని''

మురళీకృష్ణ మాటలు నాకు నవ్వు తెప్పిస్తు న్నాయి.

అందుకు కారణం కొద్ది క్షణాల క్రితం అతను ప్రవర్తించిన తీరు!

మొదటి రిక్షా వాడికి నాలుగివ్వటానికి సిద్ధపడి అతను రానంటె ఇంకో రిక్షా వాడు ఆ నాలు గుకే వస్తా నంటే మూడు రూపాయలకు బేరం ఆడాడు మురళీకృష్ణ!

నాలుగు రూపాయిలకి వస్తానని తనకై తాను ముందుకొచ్చిన రిక్షావాడి కళ్ళల్లోని తిర స్కార భావాన్ని మురళీకృష్ణ ఇందాక చదవ గలిగి ఉంటే, సరస్వతి తండ్రి మనస్తత్వాన్ని గురించి అతడు కామెంట్ చేయగలిగి ఉండే వాడు కాదని నా నమ్మకం! ●




ఉదయం వవతరం వారపత్రిక